క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న గొలగాని వీరారావు

సీతంపేట : హిందూ ముస్లిం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతంపేట రాజేంద్రనగర్‌లోని హిందూ ముస్లిం కాలనీలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన బషీర్ బాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ గొలగాని వీరారావు ప్రారంభించారు. ఆయన చేతుల మీదుగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న వైద్యులు

సీతమ్మధార : సీతమ్మధార గాంధీనగర్ పీ అండ్ టీ కాలనీలో గల రహమతుల్లా ఆస్పత్రి అధినేత డాక్టర్ రహమతుల్లా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎబాట్, టోరంట్, ఇండోకో కంపెనీల సహకారంతో నిర్వహించిన శిబిరంలో బీఎండీ, థైరాయిడ్, బ్లడ్ షుగర్, హెచ్‌బీఏ వన్‌సీ, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకురాలు శ్యామలదీపిక, వైద్యులు మురళీకృష్ణ, శ్రీధర్, ధర్మారావు, మూర్తి, శ్రీరామూర్తి రెడ్డి, సితార, నందగోపాల్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

సీతంపేట : ఎన్‌సీసీ కేడెట్స్‌కు 'ఏ' సర్టిఫికెట్ కోసం ఆదివారం శీలానగర్‌లోని ఎంపీఈవీఎం పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ సెకండియర్ ఎన్‌సీసీ విద్యార్థులు 26 మంది హాజరయ్యారు. 350 మార్కులకు జరిగిన పరీక్షలో ఆర్మీ డ్రిల్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, జనరల్ నాలెడ్జి, స్పెషలైజ్డ్ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహించారు. పరీక్షలో కనీసం 175 మార్కులు సాధించాల్సి ఉంటుందని అక్కయ్యపాలెం 11 ఆంధ్రా ట్రూప్ కమాండర్ ఎం.ఎస్.వి. విశ్వనాథం తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ఆర్మీలో చేరుటకు, వివిధ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. కల్నల్ అజయ్‌కుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి 276 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన ఎన్‌సీసీ కేడెట్లను పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ నరస, ఉపాధ్యాయులు ఎ.రామలక్ష్మి, లలిత అభినందించారు.

కేసుల్లో పట్టుకున్న వాహనాలన్నీ రోడ్డుపైనే పార్కింగ్

పట్టించుకోని ద్వారకా, నాలుగో పట్టణ పోలీసులు

ఆ మార్గంలో రాకపోకలకు వాహనదారులకు అవస్థలు



బాలయ్య శాస్త్రి లే అవుట్ రోడ్డు మీద నిలిపిన వాహనాలు

కేసులు తేలవు..
వాహనాలు కదలవు..!

సీతమ్మధార : రోడ్డు మీద వాహనాలు పార్కింగ్ చేయొద్దు... సెల్లార్ పార్కింగ్ వినియోగించండి... ఇదీ వాహన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు నిత్యం చేసే హితబోధ. కానీ కంచే చేను మేసిందన్న చందంగా ట్రాఫిక్ పోలీసులే పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను రోడ్డుపై ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేయించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నగరంలోని బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల నాలుగో పట్టణ, ద్వారకా పోలీస్ స్టేషన్లను ఆనుకుని ఉన్న మెయిన్ రోడ్డు మీదనే పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు పార్కింగ్ చేయడం విశేషం. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైం విభాగాలలో పలు కేసులకు సంబంధించిన వాహనాలను స్టేషన్‌కి తరలిస్తుంటారు. అంతవరకు బాగానే ఉంది. కానీ సంవత్సరాల తరబడి ఆ కేసులు తేలకపోవడంతో... ఎక్కడి వాహనాలు అక్కడే అన్న చందంగా పేరుకుపోతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహన యజమానులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

రద్దీ రోడ్డులో ట్రాఫిక్ జామ్

వాస్తవానికి మధురవాడలో గల వెహికల్ డిపో వద్దకే ఈ కేసులకు సంబంధించిన వాహనాలు తరలించాలని ఎంత మంది పోలీస్ కమిషనర్లు చెబుతున్నా సరే ఇటు ద్వారకా, అటు నాలుగో పట్టణ పోలీసులకు పట్టడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ 14వ వార్డు పరిధి జాతీయ రహదారి సిగ్నల్స్ నుంచి ఎడమ వైపు మార్గంలో అధిక సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. సీతమ్మధార దరి పీ అండ్ టీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్సన్, రాధాకృష్ణ లే అవుట్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తారు. ఇక్కడి మెయిన్ రోడ్డు మీదనే పలు వాహనాలు నిలిపి ఉంచడంతో మలుపు తిరిగే వాహన చోదకులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇక్కట్లు పడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు సీతమ్మధార కూడలి నుంచి, అటు గురుద్వారా కూడలి నుంచి వచ్చే వాహనాల రాకపోకలు ఈ రోడ్డు మీదుగానే జరుగుతాయి. దీంతో నిత్యం ఈ జంక్షన్ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలకమైన రోడ్డుపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించకుండా, ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేయడం ఏమిటని పరిసర ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు.



ఇరుకుగా మారిన పోలీస్ స్టేషన్ రహదారిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

రోడ్డు మీదనే కార్లు, అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు సగానికి పైగా ఆక్రమించినట్టవుతుందని స్థానికులు వాపోతున్నారు. పైనుంచి కిందకు పల్లంగా ఉండే ఈ రోడ్డులో అధిక వేగంతో వచ్చే వాహనాలకు జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు కనిపించడం లేదు. మరోవైపు ఈ రోడ్డుకి ఎదురుగానే ఆటోమొబైల్ షోరూమ్, కార్ల మెకానిక్ షెడ్డు ఉండడంతో అక్కడ కూడా నిత్యం పలు వాహనాలు పార్కింగ్ చేసి ఉంటున్నాయి. వీటన్నింటికి తోడు ఆయా పోలీస్ స్టేషన్లకు వచ్చే వారి వాహనాలతో కలిపి ఆ రోడ్డు మొత్తం గందరగోళంగా మారిపోతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా వుండే ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు కనీస చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్ ఆవరణలో కూడా వాహనాలు పేరుకుపోయి ఉండడంతో మిగిలిన వాహనాలు రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరగకముందే ద్వారకా పట్టణ ట్రాఫిక్ పోలీసులు స్పందించి వాహనాలను మధురవాడలోని వెహికల్ డిపోకి తరలించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

కనులపండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి

సీతమ్మధార : సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరం వద్ద గల ఫంక్షన్ హాల్‌లో శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ సారథ్యంలో శ్రీ భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళ ధ్వని, వేద మంత్రాలతో శ్రీమాన్ పాణంగిపల్లి రంగనాథ స్వామి బృందం కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. ప్రభాకర్, శారద దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా తిరువీధి మహోత్సవం వేదిక నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటం, సంకీర్తనలు, గోవింద నామస్మరణతో ప్రారంభమై, సీతమ్మధార త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుని... తిరిగి కల్యాణ వేదిక వద్ద ముగిసింది. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కల్యాణంలోని ఘట్టాలను చక్కగా వివరించారు. కల్యాణంలో పాల్గొన్న వారికి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు. కమిటీ సభ్యులు కేపీ రాజు, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్, సీహెచ్‌వీ సత్యనారాయణ, కొణతాల రాజు, ఎంవీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడి హత్య దారుణం



నిరసన తెలుపుతున్న గొల్లమాల అప్పారావు, తదితరులు

కంచరపాలెం : అనకాపల్లి జిల్లా పీఎల్ పురం గ్రామంలో దళిత యువకుడి హత్యపై దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనను నిరసిస్తూ కంచరపాలెం పరిధి ఊర్వశి కూడలిలో గల దళిత సేన కార్యాలయంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ నిందితులు యువకుడి కాళ్లు, చేతులు కట్టి వ్యవసాయ బావిలో పడేయడం దారుణమన్నారు. ఎస్సీ కాలనీకి చెందిన వడ్లమూరి నాగేంద్రను హత్య చేసిన సంఘటన దళిత ప్రజలను తీవ్రంగా బాధించిదని పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, సిటీ కన్వీనర్ గొల్లమాల మీనా, కార్యదర్శి పట్నాల ఝాన్సీ, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారామ్, సీహెచ్ మల్లికార్జునరావు, రాంజీ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే మానవ జన్మకు సార్థకత



వాకర్స్‌కు బహుమతులు అందిస్తున్న భాగ్యలక్ష్మి

మురళీనగర్ : సామాజిక సేవ ద్వారా మన చుట్టూ ఉన్నవారికి సాయపడడంతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఆకలితో అలమటిస్తున్న బాలలు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారికి ఒక్క పూట భోజనం పెట్టి ఆదుకోవాలన్నారు. పార్కులో పచ్చదనం పెంపునకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె ప్రశంసించారు. పార్కులో గ్రంథాలయం నిర్వహణ బాగుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మార్చి నెలలో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, జాలీ వాకర్ ఎస్.మాధవి పాల్గొన్నారు.

అలరించిన పేరడీ హాస్యావధానం



పేరడీ హాస్యావధానం చేస్తున్న కళాకారులు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నవ్వుకుందాం రండి హాస్యావధానం (పేరడీ) ప్రేక్షకులను అలరించింది. కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన పేరడీ అవధానం సభికులను ఆకట్టుకుంది. ఇందులో పృచ్ఛకులుగా జయంతి లక్ష్మీ నరసింహం హాస్యావధాని, కె.ఎల్.కామేశ్వరరావు అప్రస్తుతం, ఎం.వి.సుబ్రహ్మణ్యం సమన్వయం, నండూరి రామకృష్ణ చిత్రాంస్యం, డాక్టర్ రజని దత్తపది, రవికుమార్ ఆశువు, జబర్దస్త్ ప్రకాష్ వర్ణన, డేవిడ్ రాజు సామాజిక అంశం, గణేష్ విచిత్ర అంశం, సామవేదం వెంకట రాజేశ్వరి సమస్య అంశాలతో ప్రశ్నలు సంధించగా అవధాని హాస్యం జోడించి సమాధానాలు చెబుతూ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఛైర్మన్ సంపత్‌కుమార్, టాక్స్ కన్సల్టెంట్ తిలక్ పట్నాయక్, సన్‌మూర్తి, స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జీఎం మల్యాద్రి, డాక్టర్ పురుషోత్తం, జి.శివప్రసాద్ తదితరులు నిర్వాహకులను, పృచ్ఛకులను ఘనంగా సత్కరించారు.

బాబు ప్రభుత్వంపై దేవిశ్రీ పాటల విసుర్లు



పాట పాడుతున్న ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ

సీతమ్మధార: బాబూ నీ బడ్జెట్ చేసినావులే కనికట్టు.. కొంటే రాదు పెసరట్టు వేస్తున్నా నీపై ఒట్టు.. అనే పల్లవితో సాగే పాటతో చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ తూర్పారబట్టారు. ఆదివారం ఆయన జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 'సాక్షి'తో మాట్లాడుతూ తన పాటలోని పలు లైన్లను పాడి వినిపించారు. నీ పాలనలోన ఆంధ్రదేశము అప్పుల పాలాయె.. అన్నపూర్ణ లాంటి రాష్ట్రము కరవుతో అల్లాడే.. కోతి గెంతితే సాయిబు డబ్బు తీసుకున్న చందంగా నీ పాలనలోన రక్షణ లేదు ఇది మా ఖర్మేనా అంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని కడిగిపారేశారు. నీ పాలనలోన రైతన్నలకు గిట్టుబాటు ధర లేదు.. పరిపాలనలోన రైతన్నల నడ్డి విరిచినావు.. మింగ మెతుకు లేదంటే మీసాలకు సెంటెందుకు.. మాయ మాటలు దొంగ మాటలు ఎన్నో చెబుతావు అంటూ చంద్రబాబు పాలన తీరును తనదైన శైలిలో ఏకిపారేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ బడ్జెట్లో లేకపోవడం, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, నిరుద్యోగులకు ఉపాధి, నిరుద్యోగ భృతిపై ప్రభుత్వ తీరును ఆక్షేపిస్తూ.. పొయ్యి మీదకు లేదంటే పొయ్యి కిందకి ఇస్తాడమ్మో.. ఆంధ్రప్రదేశ్‌ని నట్టేట ముంచిపోతున్నాడమ్మో అంటూ తన పాటతో ప్రజల్ని చైతన్య పరుస్తానని పేర్కొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ సీఐ ఆత్మకూరు సత్యనారాయణ

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఫోర్తుటౌన్ సీఐ ఆత్మకూరు సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి షాపుల వద్ద అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచిగా లేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● సమాజంలో అల్లర్లు సృష్టించకుండా మంచిగా ఉండాలని రౌడీషీటర్లకు ద్వారకా సీఐ డి.వి.రమణ సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. నగరంలో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

దర్గాగా గెడ్డ కబ్జా



క్రాంతినగర్‌లో పాఠశాలకు గెడ్డ మీద ఏర్పాటు చేసిన రోడ్డు మార్గం

సీతమ్మధార : జీవీఎంసీ 23, 24 వార్డుల పరిధిలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న క్రాంతినగర్‌లో ఆక్రమణలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి ఒక ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం పాఠశాలకు పశ్చిమ దిశగా రహదారి మార్గం ఉన్నా సరే తూర్పు వైపుగా ఉన్న గెడ్డను ఆక్రమించి మరీ రోడ్డు ఏర్పాటు చేస్తోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడి 60 అడుగుల రోడ్డుకి ఆనుకుని ఉన్న మార్గంలో గెడ్డ మీద రోడ్డు ఏర్పాటు చేయడం గమనార్హం. ఇంత జరుగుతున్నా సమీపంలోని సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శి కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇంట్లో చోరీ

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ ఘటన ఆదివారం వెలుగుచూసింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రెడ్డి కంచరపాలెంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న ఆర్.సత్యనారాయణ శుక్రవారం బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి చేరుకునేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. వెంటనే డయల్ 100కు ఫోన్ చేశారు. ఘటనా స్థలానికి కంచరపాలెం పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇంట్లో ఉన్న ముప్పావు తులం బంగారం, కొంత నగదు పోయినట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలోచింపజేసిన సైన్స్ ఎగ్జిబిషన్



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతంపేట : సర్ సి.వి.రామన్ జయంతిని పురస్కరించుకుని అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాలలో ఆదివారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను యూఎస్ఏకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లాడ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తగా భారతదేశానికి ఎనలేని సేవలందించిన సర్ సి.వి.రామన్ జయంతి రోజు ఏటా జాతీయ స్థాయి సైన్స్ డే నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతవనిని రక్షించే విధంగా భవిష్యత్ తరం శాస్త్రవేత్తలుగా రాణించాలన్నారు. పాఠశాలలో చదువుతున్న ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, సౌర విద్యుత్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, తాగునీరు, వ్యవసాయం, జాతీయ చిహ్నాలతో కూడిన పలు అంశాలపై ప్రదర్శించిన 60కి పైగా నమూనాలు ఆలోచింపజేశాయి. నమూనాలు పనిచేసే విధానం, వాటి ప్రయోజనాన్ని విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్.శైలజ, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిశోధనలతోనే వర్సిటీకి గుర్తింపు



ఏయూ వీసీ రాజశేఖర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వర్సిటీ అల్యుమ్నీ ప్రతినిధులు



నూతన వీసీ రాజశేఖర్‌కు అభివాదం చేస్తున్న రీసెర్చ్ స్కాలర్లు

విశాఖ విద్య: విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి ఎనలేని గుర్తింపును తీసుకొస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన పరిశోధకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నాణ్యమైన పరిశోధనలతో విశ్వవిద్యాలయానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తును, అవకాశాలను నిర్ణయించేది పరిశోధనలేనని, వాటి కోసం పూర్తి సమయాన్ని, మేధస్సును వినియోగించాలని సూచించారు.

ఏయూ వీసీకి అభినందనలు

వీసీ రాజశేఖర్‌ను పూర్వ విద్యార్థుల సంఘం అభినందించింది. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ కె.వి.వి.రావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె.కుమార్ రాజా, జనరల్ సెక్రెటరీ ఆకుల చంద్రశేఖర్, ఈసీ మెంబర్ డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి వీసీకి అభినందనలు తెలిపారు. గాయత్రీ విద్యా సంస్థల కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు ఏయూ వీసీని కలిసి అభినందించారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధుల బృందం వీసీ రాజశేఖర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పలువురు విశ్రాంత ఆచార్యులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన



స్వర్ణ పుష్పాలను భక్తులతో తాకిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు. సూపరింటెండెంట్ జీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం




నిత్య కల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

నేత్రపర్వం.. నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

సాధనతో సజావుగా జీవిత పయనం



ప్రవచిస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ

మద్దిలపాలెం: మానవ జీవితం సజావుగా సాగేందుకు సాధన ఎంతో అవసరమని పూజ్యశ్రీ పరిపూర్ణానంద స్వామి ప్రవచించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాధన రహస్యం అంశం మీద స్వామి వారి ప్రవచన కార్యక్రమం రెండో రోజు ఆదివారం ఆధ్యాత్మిక భావంతో సాగింది. స్వామీజీ మాట్లాడుతూ మనిషి జీవితం వివిధ తాపత్రయాలతో ముడిపడి ఉంటుందని, వాటికి తాత్కాలిక ఉపశమనం, శాశ్వత పరిష్కారం రెండు విధాలుగా లభిస్తుందని వివరించారు. ఉపశమనాల నుంచి పరిష్కారం దిశగా మారేందుకు ఆధ్యాత్మిక శక్తి మాత్రమే తోడ్పడగలదని చెప్పారు. వదలడం కాకుండా ఎదగడం వేదాంత ఉద్దేశమని అద్భుతంగా ఉదహరించారు. మహాత్ములందరూ ఈ బాటలోనే నడిచి, వారు తరించి, మనకు ఉద్బోధించారని తెలిపారు. వాహనాలు నడవడానికి ఇంధనం ఎంత అవసరమో.. జీవితం సజావుగా సాగేందుకు సాధన అంతే అవసరమని పేర్కొన్నారు. కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, డాక్టర్ చిట్టిపంతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్ని జ్యోతి ప్రజ్వలన చేశారు.